

సొంతింటి.. ఆశలకు రెక్కలు



నరసరావుపేటలోని టిడ్కో ఇళ్లు

● పెండింగులో ఫేజ్-2 పనులు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి వరకూ సాగుతున్న పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో అనేక చోట్ల ఆపేసింది. పాత టెండరుదారులను ఆపేసి తిరిగి టెండర్లు తీసుకుంది. కానీ పనులు మాత్రం ఎక్కడా ప్రారంభం కాలేదు. తెనాలి పట్టణ పరి ధిలో ఫేజ్- 2 కింద 1,008 ఇళ్ల నిర్మాణం చేపట్టగా అవి 47 శాతమే పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. రేపల్లె పరిధిలో 864 ఇళ్ల నిర్మాణం చేపట్టగా గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో 2019 నుంచి పనులే జరగలేదు. వినుకొండలో 720 ఇళ్లకు 27 శాతం పనులు పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో అక్కడ కూడా నిర్మాణాలు నిలిచిపోయాయి. రివర్స్ టెండరింగ్ తర్వాత 60 శాతం వరకూ పనులు జరిగాయి. గుంటూరు పరిధిలోని వెంగళాయపాలెంలో 1,392 ఇళ్ల నిర్మాణం చేపట్టగా అవి 82 శాతం దగ్గర ఆగిపోయాయి. మాచర్ల పరిధిలో ఫేజ్- 2 కింద 1,056 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 58 శాతం పూర్తై, నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. పిడుగురాళ్ల పరిధిలో ఫేజ్-2 కింద 1,536 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 1,296 ఇళ్లకు రివర్స్ టెండరింగ్ ద్వారా టెండర్లు పిలిచారు. వారు 24 శాతం పనులు చేశారు. మిగిలిన పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. కొత్తగా కొలువుతీరిన కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. వాస్తవంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఆ ఇళ్ల నిర్మాణం కొత్త ప్రభుత్వానికి సవాలుగానే ఉంది. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తారన్న నమ్మకం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఆ దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తే పట్టణ పేదల సొంతింటి కల త్వరలోనే నెరవేరుతుంది. లబ్ధిదారులకు అందించిన ఇళ్లకు తక్షణం మౌలిక సదుపాయాలు కల్పిస్తే వారు సొంత ఇంటిలో అడుగుపెట్టే అవకాశం వస్తుంది.

సొంతిల్లు.. అందరి కల. అలాంటి కల సాకారం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో పేరుతో శ్రీకారం చుట్టగా.. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. 2019లో జగన్ ముఖ్యమంత్రి కావడంతో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. 90 శాతం వరకు పూర్తి చేసుకున్న ఇళ్లకు టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు కూడా చేయించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్ టిడ్కో గృహాలకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. మరికొన్ని మున్సిపల్ కేంద్రాల్లో రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. దీంతో పూర్తిన ఇళ్లతో పాటు టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన టిడ్కో పనులను ఐదేళ్లుగా పాడుబెట్టారు. ఇళ్లు కళ్లెదుట కనిపిస్తున్నా అందులోకి వెళ్లలేక లబ్ధిదారులు అటు అద్దెలు కట్టలేక.. ఇటు టిడ్కో ఇళ్ల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడ్డారు. ప్రతిపక్షాలతో పాటు లబ్ధిదారులు ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్లపై జగన్ ప్రభుత్వం వాయిదాలతో సరిపెట్టింది. చివరకు సౌకర్యాలు కల్పించకుండా టిడ్కో ఇళ్లకు రంగులు వేసి ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ చేసింది. దీంతో లబ్ధిదారులు గృహ ప్రవేశాలతో సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో లబ్ధిదారులు సొంతింటి ఆశలకు రెక్కలొచ్చాయి. త్వరలో అరకొర మిగిలిన పనులు పూర్తి చేసి తమకు కూటమి ప్రభుత్వం ఇళ్లను అప్పగిస్తుందన్న ఆశలో పలువురు ఉన్నారు.

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ ఈనాటి వరకూ వారి కల దాదాపు కలగానే ఉంది. గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పాడుబెట్టడమే అందుకు కారణం. తాజాగా కూటమి ప్రభుత్వం అదికారంలోకి రావడం, టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో వారి సొంతింటి ఆశల కు మళ్లీ రెక్కలు వచ్చాయి. ఏళ్లుగా నిరీక్షిస్తున్న టిడ్కో ఇళ్లు ఇక తమకు సొంతం కాబోతున్నాయన్న ఆనందం లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందని వారంతా కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. కాగా ఇప్పటికే పంపిణీ చేసిన టిడ్కో ఇళ్లలో సౌకర్యాలు లేకపోవడం తో గృహప్రవేశం చేసిన లబ్ధిదా రులు ఆ వైపు కూడా చూడడం లేదు. మౌలిక సదుపాయాలు కల్పి స్తే దాదాపు సగం ఇళ్లు ఇప్పటికిప్పుడు ఆవాసయోగ్యంగా మారుతాయి.

పాడుబెట్టిన వైసీపీ సర్కార్

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 12 పట్టణాల్లో పేదల కోసం 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయానికి చాలా చోట్ల ఇళ్లు పూర్తయ్యాయి. తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే చేయాల్సి ఉంది. కాగా 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. ఐదేళ్లపాటు కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా, లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం తాత్సారం చేసింది. దాదాపు 90శాతం నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మిగిలిన 10శాతం పనులు పూర్తిచేయకుండా ఐదేళ్లపాటు పాడుబెట్టింది. ఆ కారణంగా లబ్ధిదారులు నష్టపోయారు. కేటగిరీ- 2, 3 కింద ఉన్న 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు అప్పులు తెచ్చి నగదు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో వారంతా అప్పులకు వడ్డీలు, ఇళ్లకు అద్దెలు చెల్లించుకుంటూ నలిగిపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణ పేదల కళ్లల్లో సొంతింటి ఆశలు మళ్లీ కనిపిస్తున్నాయి.

● ఎన్నికలకు ముందు హడావుడి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 32,304 ఇళ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో 16,296 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. 300 చ.అడుగుల ఇళ్లు 13,456కు 6,733 ఇళ్లు, 365చ.అడుగుల 11,488కు 5,715 ఇళ్లు, 430 చ.అడుగుల 7,360 ఇళ్లకు 3,848 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించారు. గుంటూరు నగర పరిధిలో అడవి తక్కెళ్లపాడులో 4,192 ఇళ్లు, పొన్నూరు పట్టణ పరిధిలో 2,368 ఇళ్లు, తెనాలి పట్టణ పరిధిలో 848 ఇళ్లు, మంగళగిరి పరిధిలో 1,728 ఇళ్లు, సీఆర్డీఏ పరిధిలోని 8 గ్రామాల్లో 5,024 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నికల ప్రయోజనం కోసం గత ప్రభుత్వం హడావుడిగా ఇళ్లను లబ్ధిదారులకు అందజేసినా, అక్కడ మౌలిక సదుపాయాల కల్పన మాత్రం పూర్తి కాలేదు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యల కారణంగా లబ్ధిదారులు ప్లాట్ల వైపు చూడలేదు. రాజధాని పరిధిలోని పలు గ్రామాల్లో పదిశాతం మంది లబ్ధిదారులు కూడా ఇళ్లలో ఉండడం లేదు. గుంటూరు నగరంలో నీటి సమస్య కారణంగా లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కాగా ఇంకా 16,008 ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు దక్కలేదు. ఆ ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.



తెనాలిలో టిడ్కో గృహాలలో పూర్తయిన అంతర్గత పనులు



- ● టిడ్కో గృహాలకు గ్రహణం వీడినట్లే
- ● కల నెరవేరుతుందన్న సంతోషంలో పట్టణ పేదలు
- ● 90 శాతం పూర్తైన ఇళ్లను పాడుబెట్టిన వైసీపీ ప్రభుత్వం
- ● సదుపాయాలు కల్పించకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా పంపకం
- ● కనీస సౌకర్యాలు లేక గృహ ప్రవేశాలతో సరిపెట్టిన లబ్ధిదారులు

వర్చువల్ శిక్షణకు.. మంగళం

- ● రూ.29.05 లక్షలతో ఏర్పాటు చేసిన స్టూడియో నిరుపయోగం
- ● శిథిలావస్థలో స్టూడియోలో డిజిటల్ పరికరాలు
- ● పాఠశాలలకు కేటాయించిన నిధులు ఏమయ్యాయో?



స్టూడియోలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (పాత చిత్రం)

గుంటూరు(విద్య), ఏప్రిల్ 27: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలనే లక్ష్యంగా నాటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియోను జగన్ ప్రభుత్వం మూలన పడేసింది. ఫలితంగా స్టూడియో కోసం వెచ్చించిన రూ.29.05 లక్షలు వృధాగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వర్చువల్ తరగతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2019 మొదట్లో జిల్లాలో 55 పాఠశాలల్లో వర్చువల్ తరగతులు ప్రారంభం తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో మరో 240 పాఠశాలల్లో వర్చువల్ తరగతులు ప్రారంభం అయ్యాయి. మరో మరో 100 పాఠశాలల్లో ప్రారంభం కావాల్సి ఉంది. ఈ తరుణంలో వచ్చిన జగన్ ప్రభుత్వం తీసుకున్న రివర్స్ చర్యల కారణంగా తాజాగా వర్చువల్ స్టూడియోలు నాలుగు సంవత్సరాలుగా మూతపడ్డాయి. మరోవైపు పాఠశాలలకు కేటాయించిన నిధులు ప్రభుత్వం దారిమళ్లించి అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణ ఉన్నాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో బోధన....

గ్రామస్థాయిలో ఉన్న పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైతం మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వర్చువల్ తరగతులు నిర్మాణానికి నాటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ఫైబర్ లిమిటెడ్ ఒక్కో పాఠశాలకు రూ.4.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో డిజిటల్ స్కీన్, కంప్యూటర్, ఆడియో వీడియో కెమెరాలు, పోడియం ఏర్పాటు చేశారు. తాజాగా పాఠశాలల్లో ఇవి ఉన్నాయో లేదో కూడా ఉపాధ్యాయులు చెప్పలేక పోతున్నారు. జిల్లాస్థాయిలో ఒక స్టూడియోలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సబ్జెక్టు పాఠాలు బోధిస్తుంటే వర్చువల్ తరగతులు ఉన్న పాఠశాలల్లో ప్రత్యక్షంగా చూసి నేర్చుకునే అవకాశం ఉంది. గుంటూరు నగరంలోని పరీక్షా భవన్‌లో రూ.29.5లక్షలతో స్టూడియో నిర్మాణం చేట్టారు. సెంట్రల్ ఏసీతో స్టూడియో ఏర్పాటు చేశారు. ఇదంగా ప్రస్తుతం వృధాగా మారింది. ఇందులో ఉన్న అత్యుధునిక కెమెరాలు, ఒక గెస్ట్ రూమ్‌తోపాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు వీలుగా డిజిటల్ పరికరాలతో చేసిన ఏర్పాట్లు నిరుపయోగంగా మారాయి. ఇక్కడ తరగతులు చెబుతుంటే వర్చువల్ తరగతులు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రత్యక్షంగా వినే అవకాశం ఉంది. విద్యార్థులకు ఏవైనా సందేహాలు వచ్చినా క్లాసులో టీచర్‌ను అడిగినట్లే వెంటనే తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షణ.....

వర్చువల్ తరగతుల పర్యవేక్షణం కోసం ప్రభుత్వం అప్పట్లో జిల్లాకు ఒక కో ఆర్డినేటర్‌ను నియమించింది. ఆయన నేరుగా ప్రత్యేక యాప్ ద్వారా పాఠశాలల్లో వర్చువల్ తరగతులు అమలు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం విజయవాడలోని సెంట్రల్ స్టూడియోకు అందజేస్తారు. ఉమ్మడి జిల్లాలోని స్టూడియోలతో విజయవాడలోని సెంట్రల్ స్టూడియో అనుసంధానం అయి ఉంటుంది. ప్రతి జిల్లాలో సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల్ని ఎంపిక చేసి వారికి వర్చువల్ తరగతులు బోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు మొత్తం నిర్వీర్యం అయింది.



పరీక్షా భవన్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియో



కొండమోడు రహదారిపై భారీ గోతులు

- ● పూర్తి కాని జాతీయ రహదారుల విస్తరణ
- ● భూసేకరణలో తీవ్ర జాప్యం
- ● సాగర్ దావులపల్లి రహదారి మాత్రమే 90 శాతం పనులు పూర్తి
- ● దాచేపల్లి - మాచర్ల రహదారి నిర్మాణం సాగదీత
- ● పేరేచర్ల కొండమోడు.. వాడరేవు-అడ్డరోడ్డు రహదారుల నిర్మాణం అతిగతి లేదు



దాచేపల్లి - మాచర్ల రహదారి విస్తరణ పనులు

నత్తే నయం!



దాచేపల్లి - మాచర్ల రహదారి నిర్మాణ పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాకు ఇతర జిల్లాలతో అనుసంధానంలో కీలక రహదారుల విస్తరణ నత్తనడకన సాగుతోంది. పేరేచర్ల - కొండమోడు, వాడరేవు - చల్లగుండ్ల అడ్డరోడ్డు, సాగర్ - దావులపల్లి, దాచేపల్లి - మాచర్ల రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించిన కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు పూర్తి కావడంలేదు. భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. అయినా భూసేకరణలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. దీంతో రహదారుల విస్తరణ అడుగు ముందుకు పడడంలేదు. పల్నాడు జిల్లాకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంతో రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపరిచే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులుగా గుర్తించినా ప్రయోజనం శూన్యంగా ఉంది.

90 శాతం పూర్తి..

నాగార్జునసాగర్ నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు (దావుపల్లి) 565 జాతీయ రహదారిగా కేంద్రం గుర్తించింది. రూ.320 కోట్ల వ్యయంతో ఈ రహదారి విస్తరణ చేపట్టారు. ఈ రహదారి సరకు రవాణాకు అత్యంత కీలకం. తెలంగాణతో పాటు పల్నాడు జిల్లా నుంచి సిమెంట్, ఇతర సామగ్రి చెన్నై పోర్టుకు వెళ్లడానికి ఈ మార్గం తిరుపతి జిల్లాల్లోని ఏర్పేడు వద్ద చెన్నై రహదారికి అనుసంధానంగా ఉంది. నల్లమల అటవీ ప్రాంతం గుండా ప్రయాణించే ఈ మార్గం విస్తరణ పూర్తయితే రవాణా పరంగా ఎంతో ప్రయోజనం. ఈ రహదారి నిర్మాణం 90శాతం వరకు పూర్తయింది. సాగర్ నుంచి ఏడో కిలోమీటర్ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే రహదారి నిర్మాణం పూర్తయినట్లే.

దాచేపల్లి - మాచర్ల రహదారి విస్తరణ సాగదీత

దాచేపల్లి - మాచర్ల రహదారి(167ఏడీ) జాతీయ రహదారి విస్తరణను రూ.324 కోట్ల వ్యయంతో చేపట్లారు. ఐదేళ్ల క్రితమే రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. రహదాది విస్తరణకు అవసరమైన 44 హెక్టార్ల భూసేకరణను పూర్తిచేశారు. ఈ మార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రహదారి నిర్మాణం సగం పూర్తయింది. అయితే చంద్రవంక వాగుపై బ్రిడ్జి నిర్మించాలి. పాల్వాయిగేటు వద్ద ఆర్వోబీ, మాచర్లలో మరో ఆర్వోబీ నిర్మించాలి. పలు ప్రాంతాల్లో కల్వర్టులు పూర్తి చేయాలి. మరో ఏడాదిలో కూడా పనులు పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. రహదారి నిర్మాణంపై పర్యవేక్షణ కొరవడింది.

ఆ రహదారిపై ప్రయాణం నరకయాతన

పేరుకే జాతీయ రహదారి. వాస్తవానికి అది డొంక రోడ్డు కన్నా అధ్వానం. గోతుల మయంగా మారింది. పేరేచర్ల -కొండమోడు 167ఏజీ రహదారిపై వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు రహదారి గోతుల మయమైంది. ఐదేళ్లుగా రహదారి విస్తరణ టెండర్ ప్రక్రియ దాటలేదు. రహదారి నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. నిర్మాణం ఇప్పట్లో ప్రాంభించే పరిస్థితులు లేవు.

పేరేచర్ల-కొండమోడు మధ్య రహదారిని విస్తరించాలని దశాబ్దాలుగా వాహనదారులు కోరుతున్నారు. దీనిని జాతీయ రహదారిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేసింది. పనులు టెండర్ల ప్రక్రియలోనే నిలిచిపోయాయి. జాతీయ రహదారిగా గుర్తించినందున నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని చెబుతూ గోతులు కూడా పూడ్చడం లేదు. రోడ్డు ఇరుకుగా ఉండటం, బెర్మ్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త రహదారి నిర్మాణం మొదలయ్యే వరకు కనీసం గోతులు పూడ్చి రోడ్డుకు ఇరు వైపులా బెర్మ్‌లు వేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. పేరేచర్ల-కొండమోడు మధ్య రహదారి ఇరుకుగా ఉండటం, గోతులమయం కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు 27 కిలోమీటర్ల మేర మార్గం అత్యంత అధ్వానంగా ఉంది.

రహదారి విస్తరణకు రూ.1032.52 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగు వరుసలుగా విస్తరించడానికి 464 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కాలేదు. తొలిదశలో పనులకు సంబంధించి రూ.699 కోట్ల వ్యయంతో టెండర్లు నిర్వహించారు. ఈ మార్గం నాలుగు వరుసలుగా విస్తరించడంతోపాటు మేడికొండూరు, సత్తెనపల్లి, రాజుపాలెం మండలంలో మూడుచోట్ల బైపాస్‌లు నిర్మించాలి. ఆయా పనులు ఎప్పటికి ప్రారంభిస్తారో వేచి చూడాలి.

739.31 ఎకరాల భూమి అవసరం

నాలుగు వరుసలుగా రోడ్డు విస్తరణ, చిలకలూరిపేట, నరసరావుపేట పట్టణాలకు బైపాస్ నిర్మాణానికి 739.31 ఎకరాల భూమి సేకరించాలని జాతీయ రహదారి శాఖ గుర్తించింది. దీనిలో 706.80 ఎకరాలు ప్రైవేట్ భూమి, 32.51 ఎకరాలు ప్రభుత్వం భూమి ఉన్నట్టు నిర్ధారించారు. బొప్పూడి వరకు భూసేకరణ పూర్తయిందని అధికారులు తెలిపారు. పురుషోత్తపట్నం 16.52, కావూరు 49.15 ఎకరాల భూమి సేకరించాలి. నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76 ఎకరాలు, గణపవరంలో 5.80ఎకరాలు, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91 ఎకరాల భూమిని సేకరణకు గుర్తించారు. నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పరిధిలో 85.39 ఎకరాలు, జొన్నలగడ్డ 37.15, నరసరావుపేట 33.55, గుంటగార్లపాడు 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28 ఎకరాలు, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది.

భూసేకరణలోనే నిలిచిన వాడరేవు - అడ్డరోడ్డు జాతీయ రహదారి

వాడరేవు - చల్లగుండ్ల అడ్డరోడ్డు 167ఏ జాతీయ రహదారి భూసేకరణ సందిగ్ధంలో పడింది. ప్రైవేట్ మార్కెట్‌లో భూమి విలువ కోట్లల్లో ఉంది. ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం రూ.లక్షల్లో ఉంది. దీనిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భూసేకరణ వివాదాస్పదంగా మారుతోంది. బాపట్ల, పల్నాడు జిల్లాల గుండా ఈ రహదారి విస్తరించి ఉంది. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాల పరిధిలో భూసేకరణ చేయాల్సి ఉంది.

నరసరావుపేట బైపాస్ పాత ప్లాన్ ఆమోదం

నరసరావుపేట బైపాస్ మార్పాలని అధికారులు నిర్ణయించారు. రెండు రకాల ప్లాన్‌లను రూపొందించి కేంద్ర ప్రభుత్వం ఆమోదంకు పంపారు. ఈ రెండు ప్లాన్‌లను కేంద్రం తిరస్కరించింది. దీంతో తొలుత రూపొందించిన ప్లాన్ ప్రకారమే నరసరావుపేట బైపాస్ నిర్మించేందుకు అవసమైన భూసేకరణ చేయాలని సదరు అధికారులు నిర్ణయించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్‌ను బాధిత రైతులు దాఖలు చేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో బైపాస్‌కు భూసేకరణ నిలిచిపోయింది. రహదారి విస్తరణకు కేంద్రం రూ.1,800 కోట్ల నిధులు మంజూరు చేసింది.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ వాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

27% వరకు టారిఫ్‌ల పెంపు

జియో సేవలు మరింత ప్రియం

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్ యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు: 2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)


28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

నవ్య | చిత్రజ్యోతి

పది రోజుల వర్క్ బ్యాలెన్స్



ఒక సినిమా తర్వాతే మరో సినిమా చేయడం తమిళ దర్శకుడు శంకర్‌కు అలవాటు. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ఆయన ఒకేసారి రెండు సినిమాలు.. 'భారతీయుడు 2', 'గేమ్‌ఛేంజర్' చేయాల్సి వస్తోంది. విశిష్ట నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుండడంతో కాస్త ఊపిరి తీసుకున్న శంకర్ ఒకపక్క 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే రామ్‌చరణ్ నటిస్తున్న 'గేమ్‌ఛేంజర్' మీద కూడా దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి అప్‌డేట్ వచ్చి చాలా కాలం అవుతోంది. 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్‌ఛేంజర్' గురించి అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇంకో పది రోజుల వర్క్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' విడుదల కాగానే ఆ వర్క్ మొదలుపెడతాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తా. అవన్నీ పూర్తయ్యాక విడుదల ఎప్పుడనేది నిర్ణయిస్తా. సాధ్యమైనంత వరకూ తొందరగానే 'గేమ్‌ఛేంజర్' రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ వెల్లడించారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'గేమ్‌ఛేంజర్' లో కియారా అద్వానీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సంక్రాంతి బరిలో అజిత్ చిత్రం



తమిళ అగ్రకథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అజిత్ బ్లాక్ షేడ్స్ ధరించి , ఖైదీ డ్రెస్‌లో కనిపించారు, ఆయన చేతి మీద ఉన్న టాటూ, బ్యాక్ గ్రౌండ్‌లో మ్యాసివ్ గన్ ఫైరింగ్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. ఈ పోస్టర్‌లోనే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. దీంతో సంక్రాంతి బరిలో మరో చిత్రం చేరనట్లయింది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఫొటోగ్రఫీ: అభినందన్ రామానుజం, ఎడిటింగ్: విజయ్ వేలుకుట్టి. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేశ్ నరసింహన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

ఇక్కడే నా జీవితం మొదలైంది

రష్మిక భావోద్వేగం



ఒక పక్క అల్లు అర్జున్, ఇంకో పక్క ధనుష్, ఆ పక్క సల్మాన్‌ఖాన్. ఇవీ కాకుండా జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రంలోనూ, ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలోనూ ఆమె హీరోయిన్ అంటున్నారు. అలాగే 'గర్ల్‌ఫ్రెండ్' పేరుతో చేస్తున్న లేడీ ఓరియంటెడ్ సినిమా ఉండే ఉంది. ఇలా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో రష్మిక హవా మామూలుగా లేదు. ఇంత బిజీగా ఉన్న ఆమె తీరిక చేసుకుని చిన్ననాటి స్నేహితురాలు వివాహానికి తను పుట్టి పెరిగిన ఊరు 'కొడగు' వెళ్లింది. కర్నాటక రాష్ట్రంలోని ఆ ప్రాంతానికి వెళ్లగానే బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో భావోద్వేగానికి లోనయ్యారు. 'కొడగు.. నా హృదయం, నా చరిత్ర. జీవితం ఇక్కడే మొదలైంది' అంటూ ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. చిన్ననాటి స్నేహితురాళ్లను కలుసుకొని ఆ నాటి ముచ్చట్లను గుర్తు చేసుకుని మురిసిపోయింది.

రిలీజ్ డేట్ వచ్చేసింది



తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను గురువారం మేకర్స్ ప్రకటించారు. దసరా కానుకగా అక్టోబర్ 10న చిత్రం దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

చిత్ర పరిశ్రమకు మంచి రోజులు

- ఎన్వీ ప్రసాద్



గడ్డుపరిస్థితుల్లో ఉన్న చిత్రపరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రపంచంలోనే ఉన్నతస్థితికి చేరిందన్నారు. గతంలో రాజకీయ హింసలకు గురై దినదినగండంగా ఉండేదని గుర్తుచేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌లతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. 'కల్కి' సినిమా సంచలన విజయం సాధించడం శుభపరిణామమన్నారు. కూటమి విజయంవలే సినీ పరిశ్రమ కూడా 'కల్కి'తో మంచి విజయాన్ని అందుకుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలను కలిసి సినీ పరిశ్రమకు ఒకేరకమైన విధివిధానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు చెప్పారు. ఏపీలో కూడా సినీ పరిశ్రమ వికసిస్తుందన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగు పరిశ్రమ అందిపుచ్చుకుందని, రాష్ట్రంలో కూడా తెలుగు సినిమాల షూటింగులు విరివిగా జరుపుకోనున్నాయన్నారు. ఇక్కడ స్టూడియోలు లేకపోయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో తాత్కాలిక సెట్లు వేసుకుని షూటింగులు చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)

'కల్కి' టీమ్‌కు థ్యాంక్స్



దర్శకుడిగా ఎన్నో సంచలన చిత్రాలను తెరకెక్కించి ఎంతో మంది నూతన దర్శకులకి ఆదర్శప్రాయుడిగా నిలిచిన రామ్‌గోపాల్‌వర్మ.. 'కల్కి 2898 ఏ.డీ' సినిమాతో కొత్త అవతారం ఎత్తారు. గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంలో ఓ అతిథి పాత్రలో మెరిశారు. ఇన్నేళ్ల సినీరంగంలో ఉన్న ఆయన.. ఓ సినిమాలో నటించడం మాత్రం ఇదే ప్రథమం. ఇందులో ఆయన పాత్ర చిన్నదైనా ఎంతో వినోదాత్మకంగా ఉందని సినిమా చూసిన వారంతా అనడం విశేషం. ఈ సందర్భంగా చిత్రబృందానికి, డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి.. ఇందులో నటించిన వారందరినీ ప్రశంసించారు. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్టుకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ చిత్ర కథ మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగేలా తెరకెక్కింది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్,దుల్కర్ సల్మాన్, విజయ్‌దేవరకొండ, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి, స్వాస్థ చటర్జీ, దీపికా పదుకొనే, దిశా పటానీ, మాళవిక నాయర్, శోభన, అన్నా బెన్ కీలక పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cx6B3gN లో చదవండి.

రూ.40 కోట్ల భూ రికార్డులు మాయం



డిప్యూటీ కమిషనర్‌కు ప్రతాలు అందిస్తున్న అత్తేశ్వరరావు

చుండూరు జూన్ 27: వలివేరులో 10వ శతాబ్దాం నాటి శ్రీలలితాంబ సమేత స్వంభువేశ్వర స్వామి దేవాలయానికి 2500 సంవత్సరాల చరిత్ర ఉంది. 1937 ఆలయ రికార్డుల ప్రకారం ఈదేవాలయానికి 138.14 ఎకరాల పంట భూములున్నాయి. ఇందులో స్వంభువేశ్వర స్వామికి 96.3 ఎకరాలు, లలిత అమ్మవారికి 35.85 ఎకరాలు, వీరభద్ర స్వామికి 6.26 ఎకరాలు పంట భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నాయి. 2009లో ఈ ఆలయం పునఃప్రతిష్ఠ జరిగింది. అప్పటి ఆలయ ఈవోగా కె.బి.శ్రీనివాస్ పనిచేశారు. ఆ సమయంలో దేవాలయం పడగొట్టక ముందు దేవాలయ అకౌంట్‌లో రూ.20 లక్షలు, దేవాలయ నిర్మాణం కోసం భక్తులు ఇచ్చిన విరాళాలు రూ.80లక్షలు, దేవాలయ పునఃనిర్మాణం వరకు ఆలయంకు వచ్చిన ఆదాయం మరో రూ.30లక్షలు మొత్తం రూ.1.30కోట్ల నగదు ఈ దేవాలయానికి ఉండాలి. అయితే 2009లో ఆలయ పునఃనిర్మాణం పూర్తి అయిన అనంతరం ఈ దేవాలయానికి చెందిన 43 రిజిస్టర్ రికార్డులను మూడో కంటికి తెలియకుండా మాయం చేశారు. ప్రస్తుతం ఆలయానికి 2009 తరువాత రికార్డులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీని వలన 138.14 ఎకరాల స్థలంలో ప్రస్తుతం అధికారులు 58ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు రికార్డులు చూపుతున్నారు. దేవాలయానికి ఆదాయం పూర్తిగా తగ్గిపోవడంతో ఈ దేవాలయానికి ఉన్న గత వైభవం మరుగున పడిపోయింది. పూజాది కార్యక్రమాలు, ఉత్సవాలు నామ మాత్రంగామారాయి. దేవాలయానికి సంబంధించిన భూములు ఏమయ్యాయి అంటూ భక్తులు ప్రశ్నించసాగారు. దీనిపై ఆంధ్రజ్యోతి గత సంవత్సరం జూన్ 6న ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ దేవాలయ భూముల రికార్డులు వివరాలు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో అందులో ఉటంకించడం జరిగింది. అయినా దేవాదాయశాఖ అధికారులు దానిపై స్పందించ లేదు. చివరికి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బలభద్రపాత్రుని రాంబాబు, మాజేటి అత్తేశ్వరరావులు ఏడాది పాటు వ్యయప్రయాసాల కోర్చి వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ భూ రికార్డులను సేకరించారు. వాటిని మే 29న ఆలయ ఈవోగా పని చేస్తున్న మల్లంపాటి వీరారెడ్డిరికి అన్ని ఆధారాలతో అందించడం జరిగింది. అయినా కాని ఆలయ అధికారులు నుంచి స్పందన లేదు. రూ.40 కోట్ల విలువైన భూ రికార్డులు, రూ.1.30 కోట్ల నగదు వివరాలకు సంబంధించిన రికార్డులను వారు పరిశీలించలేదు. దీంతో గురువారం ధర్మకర్తల మండలి సభ్యులు గుంటూరు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని కలసి ఈ దేవాలయ భూములు, నగదు అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి దేవాలయానికి చెందిన కోట్ల ఆస్తులను కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. ఉన్నత స్థాయి అధికారులులైనా భూముల విషయంలో వెంటనే స్పందిస్తారని భక్తులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

● ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

గుంటూరు, జూన్27: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీకి పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జాయింట్ కలెక్టర్‌ను నియమించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ గురువారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో పాటు పాలకవర్గం, డీసీఎంఎస్ పాలకవర్గాలు రాజీనామాతో ఖాళీ అయిన విషయంతెలిసిందే. త్వరలో పాలక వర్గాలకు ఎన్నికలు జరిగేవరకు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ వ్యవహరించనున్నారు. ఇటీవల డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డీసీఎంఎస్ చైర్ పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మీలు రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఇకపై పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ వ్యవహరించనున్నారు.

కాళరాత్రిలో మృత్యుహేళ



మృతి చెందిన సోమాసీ బాల గంగాధర్ శర్మ, యశోద, డ్రైవర్ కట్టా నిర్మలరావు

● రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి
● చెట్టును ఢీ కొన్న కారు.. డ్రైవర్ సహ ముగ్గురు మృతి
● మరో ముగ్గురికి గాయాలు.. చిన్నారి పరిస్థితి విషమం
● మరో ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం
● కొత్తపాలెం, నీలగంగవరం వద్ద ఘటనలు

వినుకొండటౌన్, జూన్ 27: వినుకొండ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు.

డ్రైవర్ నిద్రమత్తులో ఉండగా కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది.

గుంటూరుకు చెందిన సోమాసి బాల గంగాధర్ శర్మ (69), ఆయన భార్య యశోద (67), కుమారుడు హెచ్‌ఎస్‌వై శర్మ, కోడలు నాగసంధ్య, మనువడు సాత్విక్, మనువరాలు అనుపమ కలిసి ఈ నెల 25వ తేదీన ఇన్నోవా కారు అద్దెకు తీసుకుని, బళ్లారిలో జరిగే శుభకార్యానికి హాజరయ్యారు. వాహనాన్ని డ్రైవర్ కట్టా నిర్మల రావు(45) నడుపుతున్నాడు. తిరుగుప్రయాణమై గుంటూరు వస్తుండగా గురువారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో డ్రైవర్ నిదర పోవడంతో, కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బాల గంగాధర్ శర్మ, యశోద, డ్రైవర్ నిర్మలరావు అక్కడికక్కడే మృతి చెందారు. బాల గంగాధర్ శర్మ తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరీ దేవాలయాల పురాణ పండితులుగా పని చేస్తుంటారు. ఈ ఘటనలో హెచ్‌ఎస్‌వై శర్మ, నాగ సంధ్య, అనుపమ తీవ్రగాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. వినుకొండ వైద్యశాలలో మృతదేహాలను స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మరో ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి



పెద్ద ఆంజనేయులు (ఫైల్)



అంజిబాబు (ఫైల్)

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో తండ్రీ కొడుకులు మృతి చెందిన ఘటన మండలంలోని నీలగంగవరం రోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశంజిల్లా, త్రిపురాంతకం మండలం గుట్ల ఉమ్మడివరానికి చెందిన మాలపాటి పెద్ద ఆంజినేయులు(40), అతని కుమారుడు అంజిబాబు(16) ద్విచక్రవాహనంపై ఉమ్మడివరం నుంచి కొత్తపాలెంలోని పంచర్ షాపు వద్ద రాత్రి పడుకునేందుకు వెళ్తున్నారు. ఆ సమయంలో వినుకొండ నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో మాలపాటి పెద్ద ఆంజినేయులు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలై అంజిబాబును మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రతలించగా, వైద్యశాల్లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య రమణమ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒకే రాత్రి జాతీయ రహదారిపై వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. మృతుల సమాచారం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రి వద్ద ఉన్న మార్చురీకి చేరుకున్నారు. ప్రమాదంలో మృతి చెందిన బంధువుల విలపిస్తున్న తీరు చూపరులను కన్నీరు పెట్టించింది.

బ్రెయిలీ ప్రెస్‌ను పునరుద్ధరించాలి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల నిరసన

గుంటూరు(తూర్పు),జూన్27: గతంలో చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన బ్రెయిలీప్రెస్‌ను పునరుద్ధరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ.కోరారు. గురువారం, గుంటూరు, హిమని సెంటర్, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో అంధ విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చొరవతో 2017లో రూ.కోటి 40లక్షల పాఠ్యపుస్తకాలను ముద్రించే రెండు ముద్రణ యంత్రాలను కేంద్రం కేటాయించిందని, దీనికోసం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో రూ.35 లక్షల విలువైన బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ భవనాన్ని నిర్మించారని గుర్తుచేశారు. 2018 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పుస్తకాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందాయని అన్నారు. 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఏఒక్క విద్యార్థికి పుస్తకాలు అందలేదని ఆరోపించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 వేల మంది అంధ విద్యార్థులు పుస్తకాలు లేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేగాక ప్రెస్‌లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.26 లక్షలను కేటాయిస్తే అందులోనూ అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.వలి మాట్లాడుతూ అవినీతిపై విచారణ జరిపించాలని, అలాగే విద్యార్థులకు పుస్తకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గా సాయి, అమర్నాథ్. అంధ విద్యార్థులు నల్లూరి రవీంద్ర, బాలు, ప్రసన్న కుమార్, యెహోషువ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు



త్రిపురాపురం కొండ వద్ద రంగు రాళ్ళు ఏరుతున్న దృశ్యం

రంగురాళ్ల కోసం వేట

● త్రిపురాపురం కొండపై వెతుకులాట
● సుదూర ప్రాంతాల నుంచి తరలి వస్తున్న ప్రజలు

నకరికల్లు, జూన్ 27: త్రిపురాపురం కొండ పైన రంగు రాళ్ళ కోసం ప్రజలు వెతుకున్నారు. ఈ కొండపై ఖరీదైన క్వార్జ్, విలువైన రాళ్ళు దొరుకుతాయనే ప్రచారంతో వివిధ ప్రాంతాల నుంచి టాటా ఏసీల్లో, ఆటోల్లో, బైకులపై వస్తున్నారు. ఖరీదైన రాళ్ళకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, కొద్దిపాటి రాళ్ళు దొరికినా జీవితంలో సంపన్నులం కావవచ్చనే ఆశతో ఈకొండకు తరలివస్తున్నారు. రంగురాళ్ళకు మంచిధర పలుకుతుందని విస్తృత ప్రచారం జరగటంతో రోజురోజుకు ఇక్కడకు వచ్చే వారిసంఖ్య పెరుగుతుంది. ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకు వెతికి సమీప హోటళ్ళల్లో భోజనం చేసి మరలా రాళ్ళ కోసం వెతకటం ప్రారంభించి సాయంత్రం వరకు విలువైన రాళ్ళ కోసం అన్వేషిస్తున్నారు. వీరితో హోటళ్ళు కిట కిట లాడుతున్నాయి. గతంలో కూడా ఇదే విధంగా రాళ్ళ కోసం ప్రజలు ఈ ప్రాంతానికి రావటంతో రెవెన్యూ, పోలీసు అధికార యంత్రాంగం ఈ ప్రాంతానికి వచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు కొంతకాలం సద్దుమణిగింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రంగు రాళ్ళ కోసం వచ్చే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నిలిపి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భర్తను హత్య చేసిన భార్య

● తాగి వేధిస్తుండటంతో రోకలిబండతో కొట్టి చంపిన వైనం
● హత్య అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగుబాటు

గురజాలటౌన్, జూన్ 27: కట్టుకున్న భర్తను భార్య రోకలిబండతో కొట్టి చంపిన ఘటన గురువారం రాత్రి గురజాల పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పల్లెగుంత గ్రామానికి చెందిన మగ్గం ఇస్మాయెల్(54) అదే గ్రామానికి గ్రామానికి చెందిన మేనమామ జమాల్ కుమార్తె నిదాన్‌బితో 30 యేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తలిరువురూ టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తూ గురజాలలో స్థిరపడ్డారు. అనంతరం వారి మధ్య గొడవలు జరుగుతుండడతో ఎనిమిదేళ్లుగా విడిపోయి దూరంగా ఉంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరూ పట్టణంలో ఉన్న తల్లి వద్ద ఉంటున్నారు. వారం రోజులుగా భర్త ఇస్మాయెల్ మద్యం తాగి భార్య ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా మద్యం తాగి గొడవ చేస్తుండగా విసిగిపోయిన భార్య నిదాన్‌బి భర్త తలపై రోకలి బండతో మోదింది. దీంతో భర్త ఇస్మాయెల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం భార్య నిదాన్‌బి పోలీస్‌స్టేషన్లో లొంగి పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

రేవుల వేలం వాయిదా

గుంటూరు సిటీ, జూన్ 27: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని పడవ, బల్లకట్టు రేవులకు గురువారం జరగాల్సిన వేలం ప్రక్రియ ను అధికారులు వాయిదా వేశారు. వేలంలో పాల్గొనేందుకు అచ్చంపేట, అమరావతి, కొల్లిపొర మండలాల నుంచి చాలామంది జడ్పీకి చేరుకున్నారు. కొందరు సీల్డ్ టెండర్లు వేసేందుకు సిద్ధమయ్యారు. టెండర్లు వేయాలంటే బల్లకట్టుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లు కావాలని జిల్లా పరిషత్ అధికారులు సూచించటంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. గతంలో సర్టిఫికెట్ టెండర్లు సమయంలో అడగలేదని కొందరు అధికారులుతో వాదించారు. వేలంను వాయిదా వేస్తున్నామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ప్రకటించటంతో వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు, జూన్ 27: పల్నాడుజిల్లాలోని ఆరు నియోజక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణా ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి పాసైన యువతీ యువకులు ఈశిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నరసరావు పేట నియోజక వర్గానికి సంబంధించి ఎస్ఎస్ఎన్ ట్రైనింగ్ సెంటర్ నరసరావుపేటలోను, వినుకొండకు సంబంధించి ఎస్‌జీకే గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వినుకొండలోను, సత్తెనపల్లికి సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కళాశాల సత్తెనపల్లిలోను, గురజాలకు సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కళాశాల పిడుగురాళ్ళలోను, మాచర్లకు సంబంధించి ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మాచర్లలోను, పెదకూరపాడు నియోజక వర్గానికి సంబంధించి గవర్నమెంట్ పాల్ టెక్నిక్ కళాశాల క్రోసూరులోను దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఆయా కేంద్రాల్లోనే ఇవ్వనున్నట్లు తెలిపారు. కుట్టు మిషన్‌ల శిక్షణకు 300 గంటలు, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ 450 గంటలు, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీ డొమెస్టిక్ వాయిస్ 450 గంటలు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ మొదలైన వాటికి శిక్షణ ఇబ్బబడుతుందన్నారు. పూర్తి వివరాలకు 9160200652 (నరసరావపేట),9951214919(వినుకొండ), 8074393466(సత్తెనపల్లి), 9492115853(పిడుగురాళ్ళ), 7842747682(మాచర్ల), 9492115853 (పెదకూరపాడు) నెంబర్లలో సంప్రదించ వచ్చునని పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన యువతీ యువకులు ఆధార్ కార్డు, ఎడ్యుకేషన్, కులం మొదలైన ధ్రువీకరణ పత్రాలు, పాసు ఫోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలియ జేశారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారిచే శిక్షణతో పాటు ఉపాధి కూడా కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు(లీగల్), జూన్27: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్నాడు బస్టాండ్ హిందూ కాలేజీ వెనక వైపు కెనరా బ్యాంక్ పక్కన సుమారు 40 ఏళ్ల వయసు కలిగన పేరు, ఊరు తెలియని వ్యక్తి పడిపోయి ఉండగా 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ అతను గురువారం మృతి చెందాడు మృతుడి చిరునామా, బంధువులు తెలిసి ఉంటే లాలాపేట పోలీసులకు 8688831311, 9154880629 నెంబర్‌లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

1న లబ్ధిదారులందరికీ పింఛన్..

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



ఎంపీడీవోలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జూలై 1న వేమూరు నియోజకవర్గంలోని పింఛనుదారులందరికీ రూ.7 వేలు పింఛను అందుతుందని మాజీమంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. గుంటూరు లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూలై ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ల పంపిణీ మొదలు పెట్టాలని ఆదేశించారు. మొత్తం పెన్షన్లు 1వ తేదీలోనే ఇచ్చేయాలని, మిగిలిన పెన్షన్లు రెండో తేదీలోపు ఎట్టి పరిస్థితుల్లో అందించాలని అన్నారు. ఏప్రిల్ నెల నుంచి పెన్షన్ మొత్తం రూ.4వేలకు పెంచి జూలైలో రూ.7వేలు ఇస్తామన్నారు. ఇంటింటికి గ్రామ.. వార్డు సచివాలయం ఉద్యోగులు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

నేడు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, జార్ఖండ్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్ ఈనెల 28న జిల్లా పర్యటనకు రానున్నారు. ఆయన తొలుత హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని 11 గంటలకు ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి కుటుంబసభ్యులతో కలిసి వెళతారు. అనంతరం విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి దర్శనంచేసుకొని మధ్యాహ్నం 12.25 గంటలకు తాడేపల్లిలోని కోదండ రామ హోం ల్యాండ్ ఎవెన్యూలో బస చేస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం 2.30 గంటలకు గుంటూరు నగరంలోని కృష్ణనగర్‌లోవున్న లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తన పర్యటన ముగించుకొని గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళతారు. సాయంత్రం 5.15 గంటలకు ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరతారు. ఈ మేరకు ప్రోటోకాల్ పాటించాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

రైల్వే పనుల పూర్తికి సహకరించండి

● కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు డాక్టర్ పెమ్మసాని వినతి



రైల్వే మంత్రిని సన్మానిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైల్వే పనులు పూర్తి చేయడానికి సహకరించాలని కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఢిల్లీలోని రైల్వే మంత్రి కార్యాలయంలో గురువారం ఆయన మంత్రిఅశ్విన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'గుంటూరు ప్రజల ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మీ సహకారం కావాలి' అని మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కోరినట్లు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక నేపథ్యాలు, పరిస్థితులపై చర్చించామన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఏళ్ల తరబడి పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రైల్వేమంత్రికి వివరించినట్లు తెలిపారు. రైల్వే సంబంధిత పనులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు అవసరమని కోరినట్లు తెలిపారు. తాను విన్నవించిన అంశాలపై మంత్రి అశ్విన్ వైష్ణవ్ మాట్లా డుతూ ప్రాజెక్టులు, పెండింగ్ నిధులను గురించి సానుకూలంగా స్పందించా రన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశానికి, దేశ ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉంటామని, సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే మంత్రి హామీ ఇచ్చినట్లు మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్నోసార్లు కన్నీళ్లు పెట్టుకున్నా..

● మూడేళ్ళు మానసికంగా వ్యధ అనుభవించా
● పేరుకే నేను చైర్ పర్సన్.. సీఈవో కూడా వాళ్ళకి నచ్చిన వాళ్లే
● రూ.120 కోట్లు దారిమళ్లించారు అంటే పవన్ ఆశ్చర్యపోయారు
● జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, జూన్ 27: 'గుంటూరు జిల్లా పరిషత్ నిర్మించి 70 ఏళ్ళు దాటింది. బిల్డింగ్ బీటలుబారి పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం వస్తే ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. అప్పటి సీఎం జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి కనీసం రూ.11 కోట్లన్నా మంజూరు చేయమని అడిగా. అలాగే అమ్మా.. ఇస్తా అని సంతకం చేశారు. ఆతర్వాత ఆఫైల్ మాయం అయ్యింది. జడ్పీ కూలుతుందన్నా కనికరించలేదు' అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తను పేరుకు మాత్రమే చైర్‌పర్సన్ అని, పెత్తనం మాత్రం జగన్ వర్గానికి చెందిన నేతలదేనని ఆరోపించారు. చివరకు జడ్పీ సీఈవో విషయంలోనూ జగన్ తన వర్గం నేతల మాటలు మాత్రమే విన్నారన్నారు. రాజకీయాల్లోకి రాకముందు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాలకు నీరు, మురుగు కాల్వల నిర్మాణం వంటివి చేద్దాం అన్నా జడ్పీలో రూపాయి లేక చెయ్యలేక పోయామని క్రిస్టీనా పేర్కొన్నారు. మూడేళ్ళ పాటు అనేక అవమా నాలు ఎదుర్కొన్నానని అన్నారు.

ఎంతో ఒత్తిడిని భరించా..

జిల్లా పరిషత్ వ్యవహారాల్లో కొందరు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు ఎన్నో రకాలుగా ఒత్తిడికి గురిచేశారని చైర్ పర్సన్ హెని క్రిస్టినా అన్నారు. చాలా సందర్భాల్లో కుర్చీలోనే కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్న రోజులు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని అన్నారు. చైర్ పర్సన్ హోదాలో కారు కూడా తీసుకోలేదని అన్నారు. జగన్ ఎప్పుడు జిల్లాకు వచ్చినా ఒక చేత్తో బొకే.. మరో చేత్తో నిధుల కోసం వినతి పత్రం అందజేసినా స్పందనే లేదన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కూడా ఆశ్చర్యపోయారు

గుంటూరు జిల్లా పరిషత్ కు స్టాంపు డ్యూటీ,సీనరేజి కింద, 15 వ ఆర్థిక సంఘం నిధుల రూపేణా రూ.120 కోట్లు ప్రభుత్వం నుంచి రావాలని చైర్‌పర్సన్ తెలిపారు. వాటిని ప్రభుత్వం దారిమళ్లించిన సంగతిని డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆశ్చర్యపోయారన్నారు.

జగన్ పిలిచినా వెళ్ళలేదు.. తాను తెలుగుదేశం పార్టీలోకి వెళ్లిన తర్వాత జగన్ తన దగ్గరకు రమ్మని కబురు పెట్టారని చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా తెలిపారు. నేను రాను అంటే రాను అని తెగేసి చెప్పానని అన్నారు. జగన్‌కి 175 కి 175 సీట్లు వచ్చినా కూడా నేను ఆయన దగ్గరకు రానని చెప్పినట్లు తెలిపారు. పార్టీ మారక ముందు 16నెలల నుంచి ఒక్క అపాయింట్‌మెంట్ ఇమ్మని అడిగినా జగన్ స్పందించలేదని అన్నారు. కేవలం చంద్రబాబు నాయుడు మాత్రమే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యగలరు అన్న నమ్మకంతో టీడీపీలో చేరానని అన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వెంటనే తన భర్త కత్తెర సురేష్ కుమార్‌కు రాష్ట్రస్థాయి పదవి ఇచ్చారని, గెలిచిన తర్వాత కూడా సీఎం వద్దకు వెళ్ళినప్పుడు జిల్లా పరిషత్‌కు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు తగిన నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

గుంటూరు(లీగల్), జూన్27: ఫొటోల పేరుతో యువతిని లొంగదీసుకొని లైంగికదాడి జరిపినట్లు నేరం రుజువుకావడంతో తాడేపల్లిలోని ముగ్గురోడ్‌కు చెందిన తాతపూడి అనిల్ కుమార్ అనే నిందితునికి పదేళ్ల జైలు శిక్ష రూ.53 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదవ అదనపు జిల్లా జడ్జి కే.నీలిమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ముద్దాయి అనిల్ కుమార్ తాను నివసిస్తున్న బిల్డింగ్ ఎదురుగా వున్న ఇంట్లో నివసిస్తున్న 19 ఏళ్ల యువతికి మాయ మాటలు చెప్పి ఆమెను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలు తనను బెదిరించి అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు ఇవ్వగా ఆ ఫిర్యాదును వారు తాడేపల్లి పోలీసులు కేసును నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం సీఐ బి.అంకమ్మరావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. కోర్టులో ఏపీపీ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. విచారణ అనంతరం అనిల్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

38,931 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 31,128 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 38,931 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 13,615 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	17200	334	8000	16600
నెంబరు. 5	9000	16000	నెంబరు. 5	11600	11600
273	7500	10000	273	–	–
341	8000	17000	341	9000	17000
4884	9000	9000	4884	–	–
సూపర్ 10	16000	16000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	20000	తేజ	8000	19800
బ్యాడిగి	8500	19000	బ్యాడిగి	9500	19000
దేవనూరు డీలక్స్	10000	10000	దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4500	12500	తెల్లకాయలు	6000	13000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



రైతులకు కందులను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

వరికపూడిశెల పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ● రైతులకు సబ్సిడీపై కుందులు అందజేత

దుర్గి, జూన్ 27: పల్నాడు ప్రజల కల వరికపూడిశెల ప్రాజెక్టును త్వరలోనే పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయం వద్ద జరిగిన సబ్సిడీపై రైతులకు కందులు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయన తాను రైతు బిడ్డనే అని, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా దుర్గిలో రైతులకు సబ్సిడీపై కందులు అందించే కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న విపత్తులను దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులైన కౌలు రైతులకు కార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. అనంతరం రైతులకు కౌలు రైతు కార్డులు, కందులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఎంపీడీవో గుప్త, ఏవో అమ్మిరెడ్డి, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, సొసైటీ ఛైర్మన్ రామారావు, కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఫోర్జరీ నిందితుడు

● తహసీల్దారు సంతకం ఫోర్జరీ చేసి బ్యాంకు రుణానికి యత్నం

● గుర్తించిన బ్యాంకు సిబ్బంది.. తహసీల్దారు ధ్రువీకరణతో ఫిర్యాదు

దాచేపల్లి, జూన్ 27: తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తులను దాచేపల్లి పోలీసులు గుర్తించారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలోని కేంద్ర సహకారబ్యాంక్ (సొసైటీబ్యాంక్)కు సంబంధించిన ఉద్యోగి సాంబశివరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. కాట్రపాడు గ్రామానికి చెందిన రెడ్డిచర్ల నరేంద్రవర్మ అనే వ్యక్తి 3 ఎకరాల భూమిని సొసైటీ బ్యాంక్‌లో పెట్టి రుణాలు పొందేందుకు ప్రయత్నం చేశారు. నరేంద్ర వర్మ బ్యాంక్ అధికారులకు ఇచ్చిన పత్రాలపై దాచేపల్లి తహసీల్దార్ సంతకం లేకపోవడంతో తహసీల్దార్ సంతకం కావాలని కోరారు. ఓ అరగంటలో తహసీల్దార్ సంతకం, ముద్రతో కూడిన పత్రాలను తిరిగి బ్యాంక్‌కు అప్పగించడం జరిగింది. సాధారణంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి సంతకాలు కావాలంటే కనీసం రెండు రోజుల వ్యవధి అయినా పడుతుంది. అటువంటిది అరగంటలోనే తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్ సంతకాలు, ముద్రలతో కూడిన పత్రాలను తిరిగి అప్పజెప్పడంతో బ్యాంక్ అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ చేసి కార్యాలయంలో తహసీల్దార్ వున్నారా? లేరా అని విచారించగా తహసీల్దార్ అందుబాటులో లేనట్లుగా తెలియవచ్చింది. దీంతో అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు రుణం ఇవ్వడం నిలిపివేశారు. గత రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం నుంచి తమ సంతకాలు ఫోర్జరీ అయ్యాయని, బ్యాంక్ అధికారులు రెవెన్యూ కార్యాలయం నుంచి వచ్చిన పత్రాలను నిశితంగా పరిశీలించిన తర్వాతనే రుణాలు ఇవ్వాలని తహసీల్దార్ గీతావాణి అధికారికంగా బ్యాంక్‌లకు నోటీసులు జారీచేసింది. తహసీల్దార్ నోటీసుతో అప్రమత్తమైన సొసైటీ బ్యాంక్ అధికారులు తమ దృష్టికి వచ్చిన పత్రాలను తహసీల్దార్‌కు అందజేశారు. దీంతో రెడ్డిచర్ల నరేంద్రవర్మపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. రెడ్డిచర్ల నరేంద్రవర్మతో పాటు నాగుల్‌మీరా మీద కూడ ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ గీతావాణి విలేకరులకు తెలిపారు.

సివిల్ సప్లయిస్ గోదాముల్లో తనిఖీ

సత్తెనపల్లి, జూన్ 27 : పట్టణంలోని సివిల్ సప్లయి స్టాక్ పాయింట్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాదు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలసి తనిఖీ చేశారు. స్టేజీ-2 ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రికార్డులను పరిశీలించారు. రేషన్ బియ్యాన్ని, ఇతర వస్తువులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మార్కెట్ యార్డులోని పౌరసర ఫరాల శాఖ గోడౌన్‌ను గురువారం ఉమ్మడి జిల్లా డీఎస్‌వో పద్మశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించడంతో పాటు స్టాక్‌ను, తూకంను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. డీలర్లకు సరఫరా చేసే ప్రతి బస్తాను తూకం వేసి ఇవ్వాలని ఆదేశించారు. రేషన్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పారదర్శకంగా వ్యవహరించండి

మాచవరం, జూన్ 27: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 సెక్రటరీలు పారదర్శకంగా అందరికీ పరిపాలన అందించాలని ఎంపిడిఓ బి సురేష్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రేడ్-5 సెక్రటరీలను డిడిఓలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తర్వులు జారీచేసిన కార్యక్రమంలో భాగంగా గ్రేడ్-5 సెక్రటరీలు, ఎంపీడీవో సురేష్, ఈవోఆర్డీ వెంగళరావు, ఏవో ప్రసాద్‌లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ గ్రేడ్-5 సెక్రటరీలు ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, జూన్ 27 : లక్ష్మయ్య మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ అన్నారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యదర్శి చిలువూరి లక్ష్మయ్య గురువారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని శివరామ్ సందర్శించి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు కొల్లు మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సచివాలయంలో నేతల చిత్రపటాలు ఏర్పాటు

పిడుగురాళ్ల, జూన్ 27: పిడుగురాళ్ల సచివాలయాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుల ఫొటోలను సచివాలయ ఉద్యోగులు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మార్పిడి జరుగడంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటంతో పాటు ఉప ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలన్న ఆదేశాల మేరకు అధికారులు నేతల చిత్రపటాలను ఏర్పాటు చేశారు.



సభలో మాట్లాడుతున్న ఏవో రామమ్మ తదితరులు

భూ యజమానులకు ఏ ఇబ్బంది ఉండదు

● వ్యవసాయాధికారి రామమ్మ

మాచవరం, జూన్ 27: కౌలుదారులకు భూయజమానులు భూపత్రాలు ఇచ్చినందువల్ల ఎలాంటి ఇబ్బందులు వుండవని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పిల్లుట్ల రైతుభరోసా కేంద్రంలో కౌలుదారుల గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గ్రామంలో వున్న ప్రతి కౌలురైతు ఓనర్ అంగీకారంతో కౌలురైతు కార్డు తీసుకోవాలని సూచించారు. దీని యొక్క కాల పరిమితి కేవలం 11 నెలలు మాత్రమేనని, దీనివల్ల భూయజమానులకు ఎలాంటి ఇబ్బంది కలగదన్నారు. ఈ కార్డుతో విత్తనాలు, ఎరువులు, పంటల భీమా తదితర ప్రభుత్వ సబ్సిడీ పథకాలు వినియోగించుకోవచ్చునని తెలిపారు. కౌలు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకొని ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులను గానీ, వీఆర్వోను గాని సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, ఎంపీటీసీ కొక్కెర అంజమ్మ వీరస్వామి, గ్రామ టీడీపీ నేతలు బి సత్యనారాయణరాజు, బీ. శ్రీను, ఉద్యానవన సహాయకులు కె నరసింహా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ఉందాం.. అభివృద్ధి చేద్దాం



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్లు

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

● మునిసిపల్ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరు

మాచర్ల రూరల్, జూన్ 27: అందరం కలిసి మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పురపాలక సంఘ సాధారణ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆయన హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే 27వవార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ పట్టణంలో పేదలకు ఇంటి స్థలాలను కొండలు, గుట్టలు, చెరువుల్లో ఇచ్చి ధనవంతులకు పీడబ్ల్యూడీ కాలనీ వంటి విలువైన స్థలాలు మూడు నుంచి ఐదు సెంట్లు చొప్పున కేటాయించారని, గత ప్రభుత్వంలో టెండర్లు పిలవకుండానే పనులు చేసి దోచుకున్నారని, అప్పటి మున్సిపల్ కమిషనర్ రమణబాబును రప్పించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా బోర్లు మంజూరు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని మాట్లాడుతూ బుగ్గవాగు స్కీం త్వరితగతిన పూర్తి చేయాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, డ్రైనేజీలో వ్యర్థాలను తొలగించాలని కోరారు. 25వ వార్డు కౌన్సిలర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కౌన్సిల్ మొత్తం సహకరిస్తుందన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి బస్టాండ్ సెంటర్ వరకు స్థలం కేటాయిస్తే వ్యాపారులమంతా కలిసి సొంతంగా సులభకాంప్లెక్స్ ఏర్పాటు చేసి నిర్వాహణ బాధ్యత తీసుకుంటామన్నారు. ఛైర్ పర్సన్ చిన ఏసోబు మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో మాచర్లకు మంచి జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ 20 యేళ్లుగా మాచర్ల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాజకీయాలు అభివృద్ధికి ముడిపెట్టకుండా అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత కింద పట్టణంలో మంచినీటి కుళాయి కనెక్షన్లు, సులభకాంప్లెక్స్‌లు, పచ్చదనం పెంపుపై దృష్టి సారిస్తామన్నారు. పురపాలక సంఘంలో సుమారు రూ. 7 కోట్లు బకాయిలు పేరుకుపోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మురుగు కాలువల్లో మంచినీటి పైపులైన్లు తొలగించాలని, వాటి వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్య, లేఅవుట్లు ప్రణాళిక బద్ధంగా వేయాలని, మాచర్ల పట్టణానికి మాష్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. అజెండాలో పొందుపరిచిన 17వ వార్డులో అన్న క్యాంటీన్ మరమ్మతులకు నిధులు మంజూరు, పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్లు ఏర్పాటు అంశాలు ఆమోదం పొందాయి. అనంతరం కౌన్సిలర్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని సన్మానించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వెంకటదాసు, డీఈ మధుసూదనరావు, ఏఈ ఆదిత్య, హనిమిరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి

కారంపూడి, జూన్ 27: ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి అన్నారు. కారంపూడిలోని బీసీ కాలనీలో ప్రజలకు అతిసార సోకడంతో గురువారం బీసీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో బోర్లలో కొత్త నీరు చేరుతూ ఉంటుందని, ఆ నీటిని నేరుగా తాగితే వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అలా కాకుండా కాచి చల్లార్చి తాగడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య సబ్ డివిజనల్ అధికారి కుమార్‌రాజా కూడా బీసీ కాలనీలో పర్యటించారు. కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని, డ్రెయినేజీల్లో మురుగునీటిని తొలగించాలని సూచించారు. వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహాల్లో పైపు లైన్లలోని నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెంకటేష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, సీహెచ్‌వో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మంచికల్లు గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

రెంటచింతల : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బీ.రవి కోరారు. గురువారం మంచికల్లు గ్రామంలో పర్యటించి ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటింటికి తిరిగి వ్యాధులను గుర్తించి వైద్య సేవలందించాలన్నారు. పది నీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో కంభంపాడు పీహెచ్‌సీ డాక్టర్ అరుణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పంటలకు నష్టం

కారంపూడి, జూన్ 27: శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌తో తమ పొలాలో పంట నష్టం జరుగుతుందని మండలంలోని గాదెవారిపల్లె, ఇనుపరాజుపల్లె గ్రామాల ప్రజలు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు దోర్నాల నాగిరెడ్డి, అంజిరెడ్డి, జినుగు శ్రీనివాసరావు, గాలం అశోక్, తగరం పేరయ్య, అద్దంకి వెంకట్రామయ్యలు మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయడంతో వర్షపు నీరంతా తమ పొలాల్లోకి చేరుతుందన్నారు. ఈ సమస్యను సబ్‌స్టేషన్ ఏర్పాటు సమయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. వర్షపునీరు పంటపొలాల్లోకి చేరుతుండడంతో పంటలు నష్టపోతున్నామని, సబ్ స్టేషన్‌ను అక్కడి నుంచి తరలించాలని అధికారులను కోరుతున్నారు.

మార్కెట్‌యార్డు ఛైర్మన్ రాజీనామా

వెల్దుర్తి, జూన్ 27: మాచర్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పదవి కాలంలో రైతులకు యార్డు ద్వారా మెరుగైన సేవలందించానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అందని ఉపాధి బిల్లులు

రెంటచింతల,జూన్ 27: మూడు వారాలు గడిచినా మహాత్మా గాంధి జాతీయ ఉపాధి పథకం కింద చేసిన పనులకు వేతనాలు చెల్లించలేదని కూలీలు వాపోతున్నారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న తాము ఈ డబ్బులు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఒక్కో కూలీకి రూ.3వేలు పైగా రావాల్సి ఉందని తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

మాచర్లటౌన్, జూన్ 27: మాచర్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద శుక్రవారం 12 గంటలకు మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు కోరారు.

ఇంట్లో చోరీ.. బంగారం అపహరణ

దాచేపల్లి, జూన్ 27: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో వెల్డింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్రం బ్రహ్మం కుటుంబ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో నివాసం వుంటున్న తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన 6 సవర్ల బంగారం, విలువైన వస్తువులను అపహరించారు. బాధితుడు బ్రహ్మం ఇంటి చుట్టుపక్కల వుండే స్థానికులు బ్రహ్మం ఇంటి తాళాలు తీసివుండి మనుషుల అలికిడి లేకపోవడంతో అనుమానంతో బ్రహ్మానికి సమాచారం అందజేశారు. బ్రహ్మం ఇంటికొచ్చి చూడగా బంగారం, ఇతర వస్తువులు మాయమైనట్లు గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సీఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ సంధ్యారాణిలు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

కారంపూడి, జూన్ 27: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని ఒప్పిచర్లలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో కూల్ డ్రింక్స్, బెల్ట్ షాపు నిర్వహించే విజయ లక్ష్మి (40) తన గృహంలో వివస్త్రగా అనుమానాస్పద స్థితిలో మృతి చెంది. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు ఆమె మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీనివాస్ ఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. హత్య కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

1న పింఛన్ల పంపిణీ

రెంటచింతల,జూన్ 27: సామాజిక పింఛన్లను జూలై 1న ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ఎంపీడీవో శంకరరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 7076 మంది వివిధ రకాల పింఛన్లను పొందుతున్నారన్నారు. మొత్తంగా 13 సచివాలయాల్లో 119 మంది సిబ్బంది వున్నారన్నారు. అయితే పింఛన్ల పంపిణీకి మరో 51 మంది సిబ్బంది అవసరం ఉందన్నారు. అయినప్పటికీ డబ్బులు పంపిణీ చేయడానికి తగ్గారన్నారు. ఒక్కరోజులోనే పింఛన్లను పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందచేయాలన్నారు.

ఇకపై ధ్రువ పత్రాలపై రాజముద్ర..

సత్తెనపల్లి, జూన్ 27 : వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్యాలయాల్లో జారీ చేసే ధ్రు పత్రాలపై కన్పించిన నాటి సీఎం జగన్ చిత్రం ప్రస్తుతం కనుమరుగైంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో సచివాలయాల్లో జారీ చేసే ధ్రువ పత్రాలపై జగన్ బొమ్మను తొలగించి రాజముద్ర హై సెక్యూరిటీ ఫారాలు సచివాలయాలకు అందాయి. వైసీపీ పాలనలో జగన్ బొమ్మ ఉన్న హైసెక్యూరిటీ పత్రాలను నిలిపివేసి రాజముద్రతో వున్న ఫారాలను ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది. ఇకపై రాజముద్ర ఉన్న ధ్రువ పత్రాలను మాత్రమే అధికారులు ప్రజలకు అందిస్తారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

దాచేపల్లి, జూన్ 27: అనుమతిలేని తెలంగాణ మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకొస్తుండగా దాచేపల్లి పోలీసులు గురువారం పొందుగల పోలీసు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన నరసింహారావు అనే వ్యక్తి నుండి 88 క్వార్టర్ బాటిల్స్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ

క్రోసూరు, జూన్ 27 : ఈనెల 1న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రంలోగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేస్తారని ఈవోపీఆర్డీ శివరామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్లను అందజేస్తారని, ఎవరూ కార్యాలయాల వద్దకు, సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

అతిసార నియంత్రణకు అధికారులతో కమిటీ

దాచేపల్లి, జూన్ 27: అతిసార వ్యాధి నియంత్రణపై తీసుకోవాల్సిన ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలపై దాచేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ మధు ఆధ్వర్యంలో గురువారం దాచేపల్లి పీహెచ్‌సీలో మండల స్థాయి అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. డాక్టర్ మధు మాట్లాడుతూ జూలై1 నుంచి ఆగస్టు 31 వరకు 2 నెలలపాటు జరుగనున్న ఉధృత అతిసార నియంత్రణ కార్యక్రమంపై చేపట్టవలసిన చర్యల గురించి వివరించారు. ప్రధానంగా పారిశుధ్య చర్యలు, నీటి వనరులను క్లోరినేషన్ చేయటం, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం, పరిసరాల పరిశుభ్రత, జన సంచారం ఎక్కువగావున్న కూడళ్లలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలను చేపట్టాలని వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్ గీతావాణి, ఎంపీ డీవో ఎస్.వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ నారాయణమూర్తి, ఎంఈవో వినాయకపాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సోమయ్య, సీహెచ్‌వో కృష్ణకుమారి, ఎంపీహెచ్‌ఈవో పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు గోవిందమ్మ, సరస్వతిదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, వరలక్ష్మి, అరుణశ్రీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధు



హైదరాబాద్‌లోని కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రిలో చేతి గూడ సర్జరీ చేయించుకున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురువారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సత్తెనపల్లి నియోజక వర్గ జనసేన నేత బొర్రా వెంకట అప్పారావులు పరామర్శించారు. - **సత్తెనపల్లి**

సత్తెనపల్లిలో రేషన్ దందా

సత్తెనపల్లి, జూన్ 27 : సత్తెనపల్లి పట్టణ, నియోజక వర్గంలో రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతుంది. సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడిలోని విఘ్నేశ్వర రైస్ మిల్లుపై పలు మార్లు విజిలెన్స్ అధికారులు దాడులుచేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సందర్భాలున్నాయి. ఇటీవల కూడా విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యాన్ని పట్టుకొని మిల్లుపై కేసునమోదు చేశారు. మండల, పట్టణంలోని కొంత మంది డీలర్లు కార్డుదారుల వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలుచేసి మిల్లులకు అధిక రేట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కిలో రూ.10 చొప్పున కార్డుదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి రూ.18 చొప్పున మిల్లర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో బియ్యం ప్రజలకు అందకుండా రేషన్‌మాఫియాకు అందుతున్నాయి. మాఫియా దారులు బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మునిసిపల్ సమావేశం

పిడుగురాళ్ల, జూన్ 27: పిడుగురాళ్ల పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఎజెండాలోని ఒక అంశాన్ని అధికారులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పురపాలక సంఘంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులను క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్లుగా నామకరణంచేసి కేటగిరి-1, 2 అనే రెండు గ్రూపులుగా విభజించి వారికి వేతనం రూ.24,500, రూ.21,000 నిర్ణయించినటట్లు ఛైర్మన్ వెంకట సుబ్బారావు తెలిపారు. అనంతరం పదవీ విరమణ చేస్తున్న డీఈ సత్యనారాయణను అధికారులు, కౌన్సిలర్లు సన్మానించారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము ముక్కంటి ఆకస్మిక మృతికి కౌన్సిల్ సంతాపం వ్యక్తం చేసి మౌనం వహించింది. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ గిరికుమార్, డీఈ సత్య నారాయణ, ఏఈ రాఘవేంద్ర, మేనేజర్ శివప్రసాద్, ఆర్ఐ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, జూన్ 27 : మారుమూల గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మారుమూల గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందాగా ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధికి మారు పేరు అని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి దిశగా పయనించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ కలసి కట్టుగా గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే చర్చించుకొని సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధే ఎజెండాగా తీసుకొని ఎమ్మెల్యే సహకారంతో ఎమ్మెల్యే నిధులతో గ్రామాలను అభివృద్ధి పరుచుకుందమన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వెన్నా సీతారామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, సత్యనారాయణ, గుడిసె కొండయ్య, మేశం శ్రీరామ్మూర్తి, ప్రసాదరావు, పీఎస్‌కు రసూల్, ఎస్ పిచ్చయ్య, సయ్యద్ జానీ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో కార్యవర్గ సమావేశం

పెదకూరపాడు, జూన్ 27 : నియోజక వర్గ కేంద్రమైన పెదకూరపాడులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పెదకూరపాడు తాలూకా కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి తాలూకా అధ్యక్షులు విజయ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి కే.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు బీ.వెంకటరావు, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, మధుబాబు, వెంకటరావు, సహాయ కార్యదర్శి నరసింహారావు, యుగంధర్, నికిల్, దిలిప్ కుమార్, మహిళా సంయుక్త కార్యదర్శి ఎస్ సుశీల, కోశాధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవు

సత్తెనపల్లి రూరల్, జూన్ 27 : సత్తెనపల్లి పట్టణ, మండలంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆర్టీఈ చట్టం కింద ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం కింద విద్యార్థులు ఉచిత సీట్లు పొందారన్నారు. విద్యా హక్కు చట్టం జీవోను న్యాయ స్థానం కొట్టివేసిన దృష్ట్యా ఏ పాఠశాలైనా విద్యార్థుల ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయరాదన్నారు. న్యాయ స్థానం నుంచి విద్యాశాఖకు ఎటువంటి ఆదేశాలు రాలేదని, ఇలాంటి విషయంలో ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న దృష్ట్యా విద్యార్థుల ఫీజుల విషయంలో ఒత్తిడి చేయకూడదని ఎంఈవో చెప్పారు.

అతిసార వ్యాధి నివారణపై అవగాహన

బెల్లంకొండ, జూన్ 27 : మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు ఆ గ్రామ పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగి వాంతులు, విరోచనాలు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ గ్రూపు సభ్యులకు, తల్లులకు, పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛమైన నీటితో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, శుభ్ర మైన సురక్షిత మైన తాగు నీటిని ఉపయోగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎంఈవో రాజకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నకరికల్లు, జూన్ 27 : కౌలుకు భూములను సాగు చేస్తున్న రైతులందరూ కౌలు రైతు గుర్తింపు కార్డులను పొందాలని వ్యవసాయ అధికారి కే.దేవదాసు కోరారు. గురువారం మండలంలోని కుంకలగుంటలో కౌలు రైతు దారులతో వ్యవసాయ అధికారులు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందటం ద్వారా ప్రకృతి వైపరిత్యాల వల్ల, పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం అందించే సాయం పొందటానికి అవకాశం ఉంటుందని ఏవో దేవదాసు తెలిపారు.ఔ సమావేశంలో వీఆర్‌వోలు, విష్ణు వర్దనరెడ్డి, ఎం ప్రసన్న కుమారి, వ్యవసాయ సహాయకులు పులి సాయి వెంకట్, నవాజ్ షరీఫ్, రైతులు ఆవుల సుబ్బయ్య, షేక్ జానీ, కొల్లి రామారావు, మైనీడి అంజయ్య, ఆవుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: కౌలు రైతులందరూ గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాల్లో జరిగిన కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల్లో కలసి 2363 కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ ప్రయోజనాలు కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తుందని తెలియజేశారు. రైతులందరూ తగిన ధ్రువీకరణ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయానికి వెళితే రెవెన్యూ అధికారులు గుర్తింపు కార్డులను అందజేయటం జరుగుతుందని తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



తాడేపల్లి వెంకటనారాయణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బారాయగుప్తా తదితరులు

ఆదర్శప్రాయులు తాడేపల్లి వెంకట నారాయణ శ్రేష్ఠి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 27: ఎస్ఎస్ఎన్ కళాశాల వ్యవస్థాకులు తాడేపల్లి వెంకట నారాయణ అందరికి ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు తాడేపల్లి వెంకటనారాయణశ్రేష్ఠి 71వ వర్ధంతిని కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఎస్ఎన్ఎన్ కళాశాలలోనే డిగ్రీ చదువుకొని ఎమ్మెల్యేగా ఇదే కళాశాలకు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దలు స్థాపించిన కళాశాలను ఈ నాటికి విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు కళాశాల కమిటీని అభినందించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ తాడేపల్లి వెంకటనారాయణ మన ప్రాంతానికి ఉన్నత విద్యను అందించేందుకు తమవంతు సహకారం అందించారని, వారి సేవలు చిరస్మరణీయం అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయగుప్త మాట్లాడుతూ ఎస్ఎస్ఎన్ కళాశాల స్థాపనకు 1950లోనే రూ.50వేలు భూరి విరాళంను అందించారని, వైశ్య విద్యార్థులకు వైశ్య హాస్టల్ ఏర్పాటుచేశారని తెలిపారు. తాడేపల్లి వెంకట నారాయణ మనుమడు తాడేపల్లి భావన్నారాయణ మాట్లాడుతూ తాతగారి సేవలను కొనసాగిస్తామని, వారి అడుగుజాడలలో ముందుకు వెళుతున్నామని తెలియజేశారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లయ్య, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వక్కలగడ్డ కోటేశ్వరరావు, కూనిశెట్టి లక్ష్మయ్య, బత్తుల వెంకట మురళిధరరావు, డాక్టర్ ఎంఎస్ సుధీర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని తాడేపల్లి వెంకట నారాయణకు ఘన నివాళి అర్పించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రొంపిచర్ల, జూన్ 27: మండలంలోని గోగులపాడులో కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం రాత్రి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర టీడీపీ కార్య నిర్వహణ కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రాములు స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులకు గ్రామ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



శావల్యాపురంలో స్కూల్‌కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, జూన్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వమందించిన స్కూల్‌కిట్స్‌ను ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారితో కలసి ఆయన గురువారం పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడకుండా ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టులు తదితర సామగ్రిని మొత్తాన్ని స్కూల్‌కిట్స్‌లో అందించిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో కూడా ప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల మౌలిక సౌకర్యాలను ఏర్పాటుచేసిందన్నారు. ఉపాధ్యాయులు మంచి విద్యాబోధనను అందించి పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, హెచ్‌ఎం బీఎస్ఎన్ శాస్త్రి, ఉపాధ్యాయులు మాలతి, జగన్మోహన్‌రెడ్డి, సీఆర్పీలు రావూరి శివ ప్రసాద్, ఎలికా శ్రీనివాసరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



ఈపూరు కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో రామతులసి

మధ్యాహ్నభోజనం తనిఖీ

ఈపూరు, జూన్ 27: ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఎంఈవో-2 రామతులసి మధ్యాహ్న భోజనం తనిఖీచేశారు. కూరలు రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన భోజనం పెట్టడం వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు, బొల్లావులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తున్న గ్రామస్థులు

ముగిసిన గంగమ్మ కొలుపులు

ఈపూరు, జూన్ 27: మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న గంగమ్మ కొలుపులు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా గ్రామస్థులు నైవేద్యాలను అమ్మవారికి సమర్పించేందుకు భారీ ఊరేగింపుగా బొల్లావులను తీసుకొని ఆలయానికి వచ్చారు. ఆలయం వద్ద అమ్మవారికి పూజలుచేసి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీశైలంలో మొక్కులు చెల్లించుకున్న టీడీపీ అభిమానులు

నూజెండ్ల, జూన్ 27: మండలంలోని వీ అప్పాపురం గ్రామానికి చెందిన రెండు వందలమంది నాయకులు, అభిమానులు కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావటంతో తమ మొక్కులు చెల్లించుకునేందుకు ప్రత్యేక వాహనాలతో శ్రీశైలం వెళ్లారు. గురువారం మల్లికార్జునుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా బుల్లీశ్వర రెడ్డి, మారెళ్ళ నారాయణరెడ్డి, నాగా సుబ్బారెడ్డి, తట్ల వెంకటేశ్వర్లు, తియ్యగూర రామిరెడ్డి, పమ్మి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరదాంజనేయ స్వామి 11వ వార్షికోత్సవం

రొంపిచర్ల, జూన్ 27: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో ఉన్న వరదాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేక పూజలను, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు

● 29న పింఛన్ డబ్బు బ్యాంకుల నుంచి డ్రా చేయాలి

● పింఛన్ పంపిణీలో వలంటీర్లు ఉండకూడదు

● కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్

నరసరావుపేట, జూన్ 27: జిల్లాలో లబ్ధిదారులకు ఒకటన పింఛన్ పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం పింఛన్‌ల పంపిణీ ఏర్పాట్లపై అయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 29న పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేయాలన్నారు. పంపిణీలో వలంటీరు ఉండకూడదని ప్రభుత్వ నిబంధనల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టాలని మండల అధికారులు, మునిసిపల్ కమిషనర్లును కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద 2,82,126 మంది పింఛన్లు పొందుతున్నారని, రెగ్యులర్ పింఛన్ల కింద రూ 120 కోట్లు, బకాయిల కింద రూ 71 కోట్లు ఆయా బ్యాంక్‌లలోఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కింద 1న పింఛన్‌ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు డ్రా చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆదివారం కూడా నిధులు డ్రా చేసుకునేలా బ్యాంకర్లతో కలసి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సచివాలయ కార్యదర్శి 50 మందికి పింఛన్ ఇవ్వాలి

సచివాలయ కార్యదర్శి ఒక్కొక్కరు 50మందికి పింఛన్ పంపిణీ చేయాలని, ఈ మేరకు సచివాలయంలో 50 మంది లబ్ధిదారులకు సంబంధించి మ్యాపింగ్ చేపటాలన్నారు. శుక్రవారం మ్యాపింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. పింఛన్‌ల పంపిణీ కోసం జిల్లా ఎస్పీతో చర్చించడం జరిగిందని, సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు బ్యాంకుల నుంచి డబ్బు డ్రా, పంపిణీ సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైనచోట అదనపు సిబ్బందిని వివిధ శాఖల నుంచి డిప్యూటేషన్ తీసుకోవాలని కలెక్టర్ లత్కర్ ఆదేశించారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి పింఛన్ తీసుకున్నట్టుగా సంతకం తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో, సజావుగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గత రెండు నెలలు పింఛన్ పంపిణీ శాంతియుతంగా చేపట్టడం జరిగిందన్నారు. పింఛన్ పంపిణీ కోసం మండల స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండాలని సూచించారు. పంపిణీ విజయవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మునిసిపల్ కమీషనర్లు, మండల అధికారులు వారి పరిధిలో గల సచివలయాలలో ఎంతమంది పింఛన్ పొందుతున్నారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన సిబ్బంది వివరాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రానికి అన్ని వివరాలు ఉండాలన్నారు. కార్యక్రమమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయాక్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జీవీ, బస్టాండ్ ఆవరణలో పారిశుధ్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, జూన్ 27: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆర్టీసీ ఆవరణలో అధ్వానంగా ఉన్న మురుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పల్నాడు జిల్లా ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు ఆదేశించారు. వినుకొండ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొట్టమొదటిసారిగా ఆర్టీసీ డిపోను గురువారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎం. శ్రీనివాసరావు, డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్‌తో కలిసి డిపో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా మరుగుదొడ్లను పరిశీలించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ అధికారులను పిలిచి మురుగునీరు ప్రవాహంపై చర్యలు తీసుకోవాలని, డ్రెయినుల్లో పూడికతీత పనులు చేపట్టాని ఆదేశించారు. ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై లేచిపోయిన బండరాళ్ళను పునర్నిర్మించాలని, కాలంచెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటుచేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో నూతన ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తామని పదే, పదే హామీలు తప్ప, చేసింది ఏమీలేదని విమర్శించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో ఉన్న మూడు ఎకరాల స్థలంలో మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్యారేజిలో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్మికుల సమస్యలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజి సిబ్బంది పాల్గొన్నారు.

మృతి చెందిన మీరావలి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

వినుకొండ, జూన్ 27: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాత నాగిరెడ్డి గ్రామానికి చెందిన షేక్ మీరావలి మృతదేహానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి కొంత ఆర్థికసాయం అందచేశారు. ఆదే విధంగా జనసేన నాయకులు కొణిజేటి నాగశ్రీనురాయల్ మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో నూజండ్ల మండలం పార్టీ నాయకులు వంకాయలపాటి పేరయ్య, లగడపాటి వెంకట్రావు, మురళీకృష్ణ యాదవ్‌తో పాటు గ్రామ, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే జీవీ

కొచ్చెర్ల (ఈపూరు) జూన్ 27: కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు,ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు విజయం సాధించినందుకు మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో తెలుగు యువత నాయకులు గోలి వెంకయ్య మరికొందరు శ్రీశైలం పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్రను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవత అంకాళపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐనాల కోటేశ్వరరావు,పెమ్మసాని నాగేశ్వరరావు,బైలడుగు రామయ్య,గోలి అప్పారావు, తూమాటి రామకోటేశ్వరరావు,మేకల ఏడుకొండలు, జనసేనా నాయకులు శీలం నరసింహారావు, నిశ్శంకరరావు అంకారావు,పిచ్చయ్య,రామకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరువుకొమ్ముపాలెంలో కల్యాణోత్సవం

నూజెండ్ల, జూన్ 27: మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో జరిగిన వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకటరావు, టీడీపీ నాయకులు ముండ్రు సుబ్బారావు, మీసాల మురళీకృష్ణయాదవ్, ముద్ర సత్యం, ఆర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అన్నదాన సత్రం శ్లాబ్ పనులు ప్రారంభం

వినుకొండ, జూన్ 27: పట్టణంలోని కొండ మెట్ల వద్ద గల పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా చేపట్టిన అన్నదానసత్రం శ్లాబ్ పనులను వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి దేవస్థానంలో పూజల అనంతరం, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించే ఏకైక ఆలయం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం అని కొనియాడారు. పేదల ఆకలి తీర్చే సేవకులు మాల్యాద్రి చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు న్యాయవాది పోట్లూరి సైదారావు, రామకోటేశ్వరరావు, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, మోటమర్రి వెంకట నరసింహారావు, సనిశెట్టి లక్ష్మీనరసింహరావు, పువ్వాడ కృష్ణ, బత్తిన నరసింహారావు, గంగిశెట్టి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



కొచ్చెర్లలో తెలుగు యువత పాదయాత్రను ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ప్రజలకు మేలుచేసిన వారికి అండగా ఉండాలి

● న్యాయబద్ధంగా పనిచేసిన వారికి బిల్లులు చెల్లించండి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 27: ప్రజలకు మేలు చేసే పనులు చేసిన వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ అతిధి గృహంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, రూరల్ వాటర్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలకు ఆవసమయ్యే పనులు చేసి బిల్లులు రాక అవస్థలు పడుతున్న కార్యకర్తలకు తక్షణమే బిల్లులు చెల్లించాలని సూచించారు. గత ఐదు సంవత్సరాలలో టీడీపీ కార్యకర్తలు బిల్లుల కోసం కాళ్ల అరిగేలా తిరిగారన్నారు. ఇప్పుడైనా అధికారులు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా బిల్లులు చెల్లించాలని సూచించారు. తెలుగుదేశం రైతులు సామాన్య పౌరులకు మేలు చేయడమే లక్ష్యంగా ఎన్నో పనులు చేసిందన్నారు. అలాంటి పనులు చేసిన వారికి బిల్లులు రాక ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమజసం అన్నారు. చిన్న సన్న కారు కుటుంబాలకు చెందిన వారు కూడా బిల్లులు రాక కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అందరికీ న్యాయం చేయాలని కోరారు. అధికారులు కూడా బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. మనది ప్రజా ప్రభుత్వం, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా అడుగులు ముందుకు పడాలని విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ కొల్లా రామారావు కన్నుమూత



చిలకలూరిపేట, జూన్ 27: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు కొల్లా రామారావు (74) స్థానిక సీఆర్ కాలనీలోని అయన నివాస గృహంలో గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా అయన పట్టణంలో కళామందిర్ సెంటర్ సమీపంలో సతీష్ నర్సింగ్ హోమ్ పేరుతో వైద్యశాల నిర్వహిస్తూ వైద్య సేవలను అందిస్తున్నారు. ఆయన మృతికి పలువురు పట్టణ ప్రముఖులు, వైద్యులు సంతాపం ప్రకటించారు.

దివ్యాంగురాలికి ఉపకరణం అందజేత



ఉపకరణాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్ సాంబశివరావు, తాతయ్య

రొంపిచర్ల, జూన్ 27: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఉయ్యాల శ్రీదేవికి చెవిటి మిషన్‌ను టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ, వయో వృద్ధుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొనుగోటి సాంబశివరావు, గరికపాటి తాతయ్య, పొనుగోటి వెంకటేశ్వర్లు, హలో శ్రీను, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతు కార్డులు అందిస్తున్న డీడీఏ శివ కుమారి తదితరులు

రసాయానిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి: డీడీఏ

నాదెండ్ల, జూన్ 27: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి సూచించారు. మండలంలోని గణపవరం గ్రామంలో జరిగిన కౌలు రైతుల గ్రామ సభలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయిస్తే దానికి అనుగుణంగా సరిపడ పశువుల ఎరువు, లేదా పచ్చి రొట్ట ఎరువులు వాడుకోవచ్చన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ కౌలుకు సాగుచేస్తున్న రైతులందరూ కౌలురైతు కార్డులకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ కార్డు పొందటం వల్ల పంట నమోదు, అకాల వైపరీత్యాలు లాంటివి సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కార్డులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాదు, కౌన్సిలర్ తులం సుధాకర్, వీఆర్‌వోలు వెంకట రమణ, సాంబశివరావు, అంకమరరావు, సహాయకులు జీవన్, లక్ష్మణ్, అశోక్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కన ఉన్న

మేజరు కాలువలో పూడిక తీయరూ..



పెట్రోల్ బంకు వద్ద నిలిచిన వర్షపు నీరు (ఫైల్ ఫొటో)

చిలకలూరిపేట, జూన్ 27: పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే పడమర వైపున ఉన్న ప్రధాన మురుగు కాలువ పూడికతో నిండిపోయింది. ఆ కాలువ భారీఎత్తున వ్యర్థాలతో నిండిపోయి ఉన్నదని ఆ ప్రాంత వాసులు తెలిపారు. ఏఎంజీ సంస్థకు ఆనుకొని ఉన్న పెట్రోల్ బంకు వద్ద చిన్న వర్షానికే మోకాలి లోతున నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అవరోధంగా ఉన్నదని వాపోతున్నారు. పెట్రోల్ బంకు వద్ద కాలువ పూర్తిగా పూడికతో నిండిపోయిందని ఆ ప్రాంత వాసులు పేర్కొన్నారు. భారీ వర్షాలకు పక్కనే ఉన్న శ్మశాన వాటికలోకి, వ్యాపార సంస్థల ఆవరణలోకి వర్షపునీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతున్నదని వివరించారు. మునిసిపల్ అధికారులు తక్షణం స్పందించి కాలువలోని పూడికతీసి మురుగు సక్రమంగా దిగువకు పారేలా ఏర్పాట్లు చేయాలని, మునిసిపల్ కమిషనర్‌తో పాటు పారిశుధ్య విభాగం వారు సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

రైతుల సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్‌కు రైతు సంఘం నేతల వినతి

చిలకలూరిపేట, జూన్ 27: రైతుల సమస్యల పరిష్కారానికై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి బాబూరావు, సీపీఐ ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ గురువారం కోరారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ప్రభుత్వం రైతులకు సాగుకు సహాయంగా ప్రకటించిన రూ.20వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలని కోరారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా పంట రుణాల మొత్తాన్ని పెంచాలని కోరారు. రూ.3లక్షల వరకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ధాన్యం బకాయిలను తక్షణం చెల్లించాలని, మురుగునీటి కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలు, వరి, వేరుశనగ, కంది తదితర విత్తనాలను 90శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలను అమ్మే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పేలూరి రామారావు, చంద్ర కొండలరావు, పర్వతనేని లక్షాధికారి, పోతవరం మహమ్మద్ సాహెబ్, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి

సొలస (యడ్లపాడు), జూన్ 27: సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని సొలస గ్రామంలో సేంద్రియ వ్యవసాయం, కౌలు రైతు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అవగాహన సదస్సులో డీడీఏ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో పంటలను సాగుచేయడం వలన పెట్టుబడులు తగ్గడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలను సాగుచేయాలనుకునే రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వచ్చిన ఫలితాల ఆధారంగా పశువుల ఎరువు లేదా పచ్చిరొట్ట ఎరువులైన పిల్లి పెసర, జనుము, జీలుగ వంటి పైర్లను వేసుకుని భూమిలో కలియదున్నుకోవాలన్నారు. అలాగే జీవసంబంధిత ఎరువులైన పీఎస్ఎం, అజటోబాక్టర్, అజోస్పిరిల్లమ్ వంటి వాటిని వినియోగించడంవలన భూసారం పరిరక్షించబడడంతోపాటు రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానంతో ఎంతో మేలు కలుగుతుందని, రైతులు ఆ వైపుగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ కౌలురైతులందరూ విధిగా సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. ఈ కార్డులు కలిగి ఉండడం వలన ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పొందేందుకు వీలుంటుందన్నారు. అంతేగాకుండా పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ సరిత, వీఆర్వో నాగజ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ దావల వెంకయ్య, ఉద్యాన సహాయకురాలు జ్యోత్స్న, జిల్లా రైతుసంఘం నాయకులు ఎం వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నియోజవకర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు తదితరులు

మాదిగల కవాతును జయప్రదం చేయండి

నరసరావుపేట టౌన్, జూన్ 27: వరంగల్‌లో జూలై 7న జరిగే 30 ఏళ్ళ మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని కంభంపాలెంలో మాదిగల చైతన్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరుగూరి నాగరాజు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఎస్సీలోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ జరగాలని అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటలకు పురుడుబోసిన ఎంఆర్‌పీఎస్ ఉద్యమం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఆవిర్భవించి జూలై 7 నాటికి 30 సంవత్సరాలు కావస్తుందన్నారు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమం ఆవిర్భవించిన నాటి నుంచి కేవలం మాదిగల కోసమే కాకుండా సమాజంలో అన్నివర్గాల ప్రజా సమస్యల మీద వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ల పెంపుకోసం, గుండె జబ్బులున్న చిన్నారుల ఉచిత వైద్యంకోసం చేసిన పోరాటమే ఆరోగ్యశ్రీకార్డు రూపకల్పనకు దారితీసిందన్నారు. కార్యక్రమంలో నిదానపు ఆనంద్ మాదిగ, బోదాల విజయ్ మాదిగ, బొమ్మ జాషువా, మేకల మోషే, తలారి చంటి, కురు లాజర్, పర్చూరి సురేష్, మల్లెడి హాను, కల్లూరి నాని, పల్లిపోగు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం దేవాలయాల్లో పూజలు

నాదెండ్ల, జూన్ 27: మండలంలోని సాతులూరులో వరుణుడి కరుణకోసం దేవాలయాల్లో గ్రామస్థులు ప్రత్యేక పూజలుచేశారు. గ్రామంలోని పోలేరమ్మ, ఊరంకమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, రెడ్డిపేరంటాళమ్మ తల్లి దేవాలయాల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు నీరుపోసి పూజలు చేశారు. గ్రామస్థులకు ఫలహారాలను అందజేశారు.